

"దగ్గర్లోనే..." అని తను ఉండే లొకాలిటీ చెప్పింది ఆమె.

"మరి ఎలా వెళ్తారు?"

"నా స్కూటీ పార్కింగులో ఉంది..." అని వెళ్లి స్కూటీ ఎక్కి వచ్చింది.

"మీ వెహికిల్ చాలా బాగుంది."

"థాంక్స్..."

"వెళ్లి రండి..." భారంగా అన్నాడు రమేష్.

అంత భారంగా కాకపోయినా, కొద్దిగా అలజడి చెందిన మనసుతో ఆమె వెళ్లి పోయింది. ఆమె అటు వెళ్లిందో, లేదో... ఆదిత్య చాటు నుండి వచ్చి రమేష్ భుజం మీద చెయ్యి వేశాడు. బ్రహ్మం, భ్రమరం కూడా గాలిలో నుండి ప్రత్యక్షమైనట్లు ఒక్కసారిగా ఊడిపడ్డారు.

"కంగ్రాచ్యులేషన్స్..." మూకుమ్మడిగా చెప్పారు అందరూ.

"ఇప్పుడేమయిందని?" మొహమాటంగా అన్నాడు రమేష్.

"ఏమయ్యేదేమిటి? సంవత్సరంగా ఆ అమ్మాయిని చూస్తున్నావు. ఇప్పటికీ ఫొటో తియ్యటానికి కూడా అర కిలోమీటరు దూరంలో నిలబడతావు. అలాంటిది ఒక్క రోజులో ఆ అమ్మాయితో మాట్లాడేటట్లు చేశానా, లేదా?"

"నిజమే బాసూ! అంతా బానే ఉంది. నీ ఫీజు తప్ప..."

"ఇవాళ్టి ఫీల్డు ఎక్సర్‌సైజ్ ఖర్చులు ఎంతయ్యాయి బ్రహ్మం?" అడిగాడు ఆదిత్య.

"రౌండ్ ఫిగర్ చేసి చెప్తున్నాను... పది వేలు."

"అది రేపు మా వ్యాఘ్రానికి పే చెయ్యి." రమేష్‌తో చెప్పాడు ఆదిత్య.

"అందమైన లోకమనీ... రంగురంగులుంటాయనీ... అని పాట పాడుకుందామనుకున్నాను. ఇంతలోనే డబ్బుల విషయం గుర్తు చేసి నా ఆనందాన్ని సగం నాశనం చేశారు. అది సరే! ఈ భ్రమరం ఎవరి పార్టీ? నా ఇమేజ్ డామేజ్ చేస్తోంది..."



"అది కూడా స్ట్రాటజీనే! ఆ అమ్మాయి అనుకునే మాటల్ని భ్రమరం బయటకు అంది. దాంతో తప్పనిసరిగా తను నీ గురించి పాజిటివ్‌గా ఆలోచిస్తుంది..."

"సరేలే! రేపు నన్నేం చెయ్యమంటారు?"

"ఆఫీసులో ఆ అమ్మాయి పనిచేసే చోటును వెతుక్కుంటూ వెళ్లు..."

"వెళ్లి..."

"ఈ కార్డు ఆ అమ్మాయికి ఇవ్వు."

"ఏం కార్డు ఇది?"

"సౌందర్య పోయిందనుకుంటున్న బ్యాంక్ కార్డ్."

"ఇది నీకెక్కడిది?" కీచుగా అరచినట్లు అన్నాడు రమేష్.

"ఆ అమ్మాయి దగ్గర భ్రమరం కొట్టేసింది..." కూల్‌గా చెప్పాడు ఆదిత్య.

"ఈవిడ దగ్గర ఈ కళలు కూడా ఉన్నాయా?"

"ఇన్ని కళలు ఉన్నాయి కాబట్టే అంత ఫీజు వసూలు చేసేది."

ఆ కార్డు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు రమేష్. "ఒక అనుమానం... ఈ కార్డు నీకెక్కడిదంటే ఏమి చెప్పను?"

"కార్డు ఎవరికో దొరికితే మాల్‌లో అప్పచెప్పారనీ, మాల్ వాళ్లు ఎనౌన్స్ చేస్తే నేను వెళ్లి కలక్ట్ చేసుకు వచ్చాననీ చెప్పు..."

"నీ దగ్గర ప్రతి సమస్యకీ ఒక సమాధానం ఉంటుందేం..."

"కార్డు ఇచ్చే నెపం మీద అమ్మాయిని కలుసుకున్నపుడు ఏం మాట్లాడతావ్?"

"ఏమో?..."

"దానికి సెపరేట్ కోచింగ్ ఇస్తాలే!" ఓదార్చాడు ఆదిత్య.

ఇంతలో మాల్ మేనేజర్ పరుగెత్తుకుంటూ బయటకు వచ్చాడు. సరాసరి భ్రమరం దగ్గరకు నడిచి, "మేడమ్! మీరు కొన్న వస్తువుల బిల్ ఇదేనా?" ఒక బిల్ చూపించి అడిగాడు.



"అవును. ఏం? ఏమన్నా లాటరీ తగిలిందా?" ఆశగా అడిగింది భ్రమరం.

"దాదాపు అలాంటిదే! ఈరోజు మీ వలన మా సేల్స్ లక్షల్లో పెరిగాయి. అందుకని మీరు తీసుకున్న వస్తువుల మీద చార్జెస్ తీసేస్తున్నాం. ఇవిగో మీరు కట్టిన డబ్బులు..." అని డబ్బు ఇచ్చాడు.

"మా భ్రమరం మీకు లక్షల్లో బేరాలు పెరిగే పని ఏం చేసిందబ్బా?..." డౌటు వెలిబుచ్చాడు బ్రహ్మం.

"మొదటి విదియ తరువాత వచ్చే తదియ అని ఏదో ఒక కొత్త బోడో పండుగ కనిపెట్టారట కదా!... దానికి ప్రతిగా ఏదో మాకు తోచిన ప్రతిఫలం ఇస్తున్నాం. ఇక ఈ పండుగ మార్కెటింగ్ మేము చూసుకుంటాం..." లోపలకు వెళ్లిపోతూ చెప్పాడు అతను.

నవ్వాలో, ఏడవాలో తెలియక అందరూ అతన్నే చూస్తుండి పోయారు.

((((()))))) 

మరుసటి రోజూ చీకటి దుప్పటి తొలగించుకుని ఠంచనుగా టైము తప్పకుండా ఉదయించాడు సూర్యుడు.

లోకంలో అన్ని పనులూ యధావిధిగా జరిగిపోతున్నాయి.

తన అపార్టుమెంట్ బాల్కనీలో కూర్చుని కాఫీ తాగుతున్న ఆదిత్యకి తను తప్ప అందరూ ఆనందంగా ఉన్నట్లు అనిపిస్తోంది. కింద జరుగుతున్న సందడిని మౌనంగా గమనిస్తున్నాడు అతను.

అప్పుడే వచ్చిన స్కూలు బస్సు ఎక్కి పిల్లలు ఎగురుకుంటూ గంతులేస్తూ వెళ్లిపోతున్నారు.

పక్క వీధిలో పాకెట్ పాలు కొని, వాటికి మునిసిపల్ కుళాయిలో నీరు కలిపి ఒక లీటర్ పెట్ బాటిల్లో తెచ్చి అప్పుడే పిండిన పాలని చెప్పి, 304 వాళ్లకి ఇచ్చి వెళ్లి పోతున్నాడు మోటర్ సైకిల్ మీద వచ్చిన పాలమ్ముకునే అతను. జనాల్ని బకరాలు చేసే ప్రక్రియలో మరో రోజు గడిచినందుకు అతనికి గుర్రమెక్కినట్లు ఉంది.

401 లో ఉండే ఇంజనీరింగ్ చదివే అమ్మాయి తన టూ వీలర్ స్టార్ట్ చెయ్యటానికి ఇబ్బంది పడుతోంది. ఆమెతో పాటు అదే కాలేజిలో చదువుతున్న 206 కుర్రాడు హెల్ప్ చేశాడు. వెహికిల్ స్టార్ట్



అయింది. రహస్యంగా అతనిచ్చిన చీటీని గుప్పిట్లో దాచుకుని ఆ అమ్మాయి బుగ్గలు ఎర్రబడగా రయ్యిమని వెళ్లిపోయింది.

ఆ బామ్మగారి అపార్టుమెంట్ నెంబర్ తెలియదు కానీ, ఎవరూ లేవకముందే లేచి చుట్టు పక్కల వీధుల్లోని ఇళ్లలో ఉన్న పూల మొక్కలకు పూచిన పూలను దర్జాగా కోసుకు వచ్చి అటు నుండి అటే గుడికి వెళ్లి మండపంలో కూర్చుని మాల కట్టి దేవుడికి సమర్పించి ఇప్పుడే తిరిగి వస్తోంది. ఆమె మొహంలో మరో కిలో పుణ్యం మూట కట్టుకున్న ఆనందం వద్దన్నా ఆగకుండా ప్రతిఫలిస్తోంది.

ఆవిడ భర్త... పదేళ్ల క్రితం రిటైర్ అయిన హెడ్ మాస్టర్, దూరంగా భార్య రావటం చూసి... చేస్తున్న కూరగాయల బేరం ముగించి ఇంట్లోకి నడిచాడు. అప్పటిదాకా తను ప్రదర్శించిన నోటి దురదకు తనకు తానే తృప్తి చెందిన అతని మొహం ముడతల మధ్య క్రూరపు నవ్వు. అతను మాట్లాడిన ద్వందార్ధపు మాటలను అర్ధంకానట్లు నటించి, భరించి పది రూపాయల కూరగాయలు ఇరవై రూపాయలకు అమ్మిన ఆమె మొహంలో అతన్ని మోసం చేసాననుకుంటున్న అసహాయపు నవ్వు.

అందరూ బానే ఉన్నారు. మరి నాకేం అయింది?

మొన్న విమానంలో కనిపించిన ఈషికని ఎందుకు మరచిపోలేక పోతున్నాడు. ఇంతవరకు తనకు పరిచయమయిన వందలాది అమ్మాయిలను చూసినపుడు ఎప్పుడూ కలగని ఈ ఫీలింగ్ ఇప్పుడు ఈషికని చూసినపుడు ఎందుకు కలుగుతోంది?

ఈషిక అతిలోక సౌందర్యవతా అంటే అదీ కాదు, ఆకర్షణీయంగా ఉందంతే! మరి తనలో ఏమిటీ అలజడి?

అన్నిటికంటే అతన్ని పీడిస్తోంది ఆరోజు అతను ఆ అమ్మాయితో ప్రవర్తించిన తీరు. అమ్మాయిల మనసు చదవగలననే తన ఓవర్ కాన్ఫిడెన్స్ ఎదురు తిరిగిందా? తన మనసుకి వ్యతిరేకంగా ఆ అమ్మాయిని పట్టించుకోనట్లు వెళ్లి పోవటం ఎదురు తిరిగిందా? ఆ అమ్మాయికి 'అఆఇఈ' అవసరం ఉందన్న తన అంచనా తప్పా? నిజంగా ఆమెకి తన అవసరం ఉన్నట్లయితే రెండు ఆహ్వానాలు పంపినా కాంటాక్ట్ చేసే ప్రయత్నం ఎందుకు చేయలేదు?

అతని ఆలోచనలలో అతను ఉండగానే ఫోన్ మోగింది.

"చెప్పు వ్యాఘ్రం..."



"ఈ రోజు ఆఫీసుకు వచ్చేటప్పటికి లేటయ్యేటట్లుంది. కాస్త నువ్వెళ్లగలవా?" అభ్యర్థించాడు వ్యాఘ్రం.

"నీకు ఆఫీసుకు వెళ్లటం కంటే ముఖ్యమైన పనా? జోక్ చేస్తున్నావా?"

"లేదు ఆదిత్యా? ఇది జోకులు వేసే సమయం కాదు, నా మనసు ఏం బాలేదు..." భారంగా అన్నాడు.

అతని మాటల్లో సీరియస్‌నెస్ గమనించిన ఆదిత్య అలర్ట్ అయ్యాడు. "ఏమయింది? నన్ను రమ్మంటావా?" అని అడిగాడు.

"ఇక్కడ నువ్వు చెయ్యగలిగింది ఏమీ లేదు. జరగాల్సిందంటా జరిగి పోయింది..."

"సినిమా భాష మాని ఏం జరిగిందో చెప్పు."

"మనోజ్ అని నా స్నేహితుడు ఉన్నాడు. బహుశా నువ్వూ చూసే ఉంటావు."

"ఎందుకు గుర్తు లేదు. మొద్దబ్బాయిలా ఉంటాడు. ఏమయింది అతనికి?"

"విడాకులు తీసుకుంటున్నాడు..."

"అయితే?... అదొక వింతా విశేషమా? దానికి నువ్వెందుకు అంత బాధ పడటం?..."

"నేనే కాదు, ఇంట్లో వాళ్లందరూ బాధ పడుతున్నారు. వీధిలో వాళ్లందరూ వింతగా చూస్తున్నారు."

"ఏదో ఎవరికీ జరగని విషయం జరిగినట్లు చెప్తున్నావ్! సరే నీ పనిలో నువ్వుండు. ఆఫీసు సంగతి నేను చూసుకుంటాను. ఏది ఏమయినా నీకూ బయట తిరుగిళ్లు ఎక్కువయ్యాయి. రాత్రి నేను వచ్చేటప్పటికి ఏదో పెళ్లని వెళ్లావు. ఇప్పుడు విడాకులని ఓదార్చటానికి వెళ్తున్నానంటున్నావ్..."

"ఈ విడాకుల జంట రాత్రి పెళ్లి చేసుకున్నవాళ్ళే! ఇంకా పెళ్లికి వచ్చిన చుట్టాలందరూ ఇక్కడే ఉన్నారు." బాంబులాంటి వార్తని నెమ్మదిగా చెప్పాడు వ్యాఘ్రం.

అదిరి పడ్డాడు ఆదిత్య. "రాత్రి పెళ్లయితే తెల్లారేసరికి విడాకులా? విడాకుల చరిత్రలో ఇది రికార్డేమో! నన్ను కూడా రమ్మంటావా? వాళ్లని చూసి తరిస్తాను."



“ఇదేమన్నా దేవుడి కళ్యాణమా? పిలవకుండా ప్రతి ఒక్కడూ వచ్చి... దండం పెట్టుకుని, భోజనం చేసి వెళ్లటానికి...”

“అసలెలా జరిగిందో చెప్పు. విని విచారిస్తాను.”

“అంతా మన మనోజ్‌గాడి మూర్ఖత్వమే! నిన్న సాయంత్రం పెళ్లయ్యాక రాత్రికి శోభనం ఏర్పాటు చేశారంట. అక్కడ నానా కంగాళీ చేశాడు మనాడు...”

“అంటే?”

“ఇప్పటి వరకూ ఎలా ఉన్నా ఇక మన మధ్య రహస్యాలు ఉండకూడదు. నా రహస్యాలన్నీ నేను చెప్తాను. తరువాత నువ్వు కూడా నీ రహస్యాలు చెప్పాలి అన్నాడంట.”

“వాడి బొంద. వాడి బతుక్కి రహస్యాలు కూడానా?... నోట్లో వేలు పెడితే కొరుకుతాడు కూడానా?”

“మరదే! ఆ ఇమేజి మార్చుకోవటానికే ఎవడో చెప్పిన సలహా విని పెళ్లి కూతురుతో ఆ ప్రపోజల్ పెట్టాడంట...”

“తరువాత ఏమయిందో చెప్పు.”

“ఏముంది? ఆ అమ్మాయి కూడా ఆ ప్రపోజల్ బానే ఉందంది. వీడు తనకు లేని ఒక ప్రేయసిని సృష్టించి... లేని ఒక ప్రేమ కథని వండి వార్చాడంట. అంతా చెప్పటం అయ్యాక... ఇదంతా ఒకప్పటి సంగతనీ, ఇప్పుడు తన మనసులో ఎవరూ లేరనీ చెప్పాడంట.”

“ఆ అమ్మాయి నమ్మిందా?”

“చెప్పేది పూర్తిగా విను. ఆ అమ్మాయి అర్థం చేసుకున్నట్లు నెమ్మదిగా తల ఊపిందంట. తరువాత వీడు ఇక నీ రహస్యాలు చెప్పు అన్నాడంట. ఆ అమ్మాయి తల వంచుకుని ఏమీ మాట్లాడలేదంట. నీకు ఏం భయం లేదు. ఎలాంటి రహస్యమైనా తట్టుకుంటాను. చెప్పు... ఎవరైనా లవర్ ఉన్నాడా? వన్ సైడు లవ్వా? ఇద్దరూ ప్రేమించుకున్నారా? మరయితే అతన్నెందుకు పెళ్లి చేసుకోలేదు?... అని ఆ అమ్మాయిని తెగ విసిగించాడంట. అప్పటికీ ఆ అమ్మాయి సమాధానం చెప్పలేదంట. చెప్పు, నీ లవర్ పేరు చెప్పు... అని మరింత విసిగించాడంట. చివరికి ఆ అమ్మాయి తలెత్తి కాసేపు మౌనంగా ఉంటావా? అందంట. వీడు, ఎందుకన్నాడంట. లవరెవరో చెప్పు, చెప్పా



అని చెవి తెగిన మేకలా గోల చేస్తుంటే, లవర్ల లెక్క తేలవద్దా? అందంట. వీడు అప్పుడు మూర్ఛ పోయి తెల్లారి లేచాడంట. అప్పట్నుంచి నాకు విడాకులు కావాలంటున్నాడు..."

"ఎవడి ఖర్మకి ఎవడు బాధ్యుడు? సరే! నువ్వు వాడ్ని ఓదార్చే కార్యక్రమంలో నిమగ్నం అవు. నేను ఆఫీసు పని చూసుకుంటాను..."

"మారచి పోకుండా మా తాత ఫొటోకి కాస్త పూజ చెయ్యరా!..."

"సరేలే!..."

"మీ తాత ఫొటోకి ఎలా పూజ చేస్తావో మా తాత ఫొటోకి అలానే చెయ్యాలి. సరేనా?"

"అంటే రోజూ నువ్వు పూజ తేడాగా చేస్తావా?"

"ఛీ! ఛీ!!... అలా కాదు..."

"ఇక ఈ గొడవ వదిలెయ్! నేను చూసుకుంటాలే..." అంటూ లేచి తయారుకావటానికి లోపలకు నడిచాడు.

అతను అఫీసుకు వచ్చేటప్పటికి బ్రహ్మం, భ్రమరం వచ్చి ఉన్నారు.

"ఏంటి బ్రహ్మం? రాత్రి ఫ్రీ డ్రస్ దొరికినందుకు మీ ఆవిడ హ్యాపీనా? బాగా ఎంజాయ్ చేశారా?" అడిగాడు ఆదిత్య.

అటుఇటూ చూశాడు బ్రహ్మం. భ్రమరం ఏదో పని మీద కాస్త దూరంగా ఉంది. రహస్యంగా ఆదిత్య చెవిలో, "మీరు ఎవరికీ చెప్పనంటే ఒక సృష్టి రహస్యం చెప్పనా?" అన్నాడు.

"అంత ఎప్పుడు ఎదిగి పోయావు బ్రహ్మం?"

ఆ మాట పట్టించుకోకుండా చెప్పటం మొదలు పెట్టాడు బ్రహ్మం. "సృష్టి మొదట్లో దేవుడు ఒక్కడే ఉండేవాడు. తను ఆనందంగా ఉండేవాడు. తరువాత అనేక జీవజాతులను సృష్టించాడు. అవి కూడా ఆనందంగా ఉండేవి. కానీ దేవుడికి ఏదో అసంతృప్తి. తనకి సమానంగా కాకున్నా, మిగిలిన జీవజాతులకంటే ఉన్నతంగా ఒకరిని సృష్టించాలని మగవాడిని సృష్టించాడు. కొన్నాళ్ళు అందరూ కలసి ఆనందంగా జీవించారు. నెమ్మదిగా మొగవాడి కాంస్ట్రేషన్ మిగిలిన జీవజాతుల మీద పడింది. వాటి ఆనందం దూరం అయింది. అవన్నీ కలిసి దేవుడికి మొర పెట్టుకున్నాయి.



దానితో దేవుడికి ఆనందం లేకుండా పోయింది. ఆయనకి ఈ మొగవాడిని ఎలా కంట్రోల్ చెయ్యాలో తెలియలేదు. ఆలోచించీ... ఆలోచించీ చివరికి ఆడదాన్ని సృష్టించాడు. అప్పట్నుండి మగవాడికి ఆనందం కరువయ్యింది. దేవుడితో సహా మిగిలిన జీవజాతులన్నీ ఆనందంగా ఉండసాగాయి..."

"టూమచ్‌గా మాట్లాడుతున్నావు. ఊరుకో బ్రహ్మం. భ్రమరం వింటే నీకే ప్రమాదం..."

"భ్రమరం ఎలా వింటుంది? మీరు చెప్పరుగా... మగాళ్లు ఇలాంటి రహస్యాలను ఒక చెవితో విని మరో చెవితో వదిలేస్తారు."

"మరి ఆడాళ్లయితే?"

"రెండు చెవులతో విని నోటితో వదిలేస్తారు."

"ఏంటి ఏదో గుసగుసలాడుతున్నాడు?" అడిగింది బ్రహ్మం.

"ఏవో పనికిరాని విషయాల్లే..." తేల్చేశాడు అదిత్య.

"పనికొచ్చే విషయాలు మాట్లాడటానికి పస ఉండాలిగా. ఎప్పుడూ ఒకరి మీద పడి ఏడవటమే?" ఆ గదిలోని కాగితాలు ఇంకో గదిలోకి తీసుకు వెళ్తూ అంది భ్రమరం.

"చూశారా!... మగవాడు తన గోల్ రీచ్ కావాలంటే కష్టపడతాడు. కృషి చేస్తాడు. పట్టుదలతో సాధిస్తాడు. కానీ, ఆడది సాధించాలంటే ఇవన్నీ ఏమీ చెయ్యనవసరం లేదు. పెళ్లి చేసుకుంటే చాలు."

"నేను ఇంతకు ముందులా నీ జోక్స్ ఎంజాయ్ చెయ్యలేక పోతున్నాను బ్రహ్మం..."

"పెళ్లి టైము దగ్గరకొచ్చాక వచ్చే మొదటి సింప్టమ్ అదే!"

"మరి ఇప్పుడే ఇలా ఉంటే, పెళ్లయ్యాక నా పరిస్థితి ఏంటి?"

"అక్కడే పప్పులో కాలేశారు. మీరు చెయ్యవలసింది పెళ్లి 'చేసుకోవటమే'. మిగిలినవన్నీ ఆవిడే 'చూసుకుంటుంది.'"



ఇంతలో ఒక్కసారిగా పరిచయమున్న పరిమళం ఆదిత్యని చుట్టుముట్టుంది. గాఢంగా ఊపిరి పీల్చి వదిలాడు. "బ్రహ్మం! నా ప్రియురాలు వస్తోంది..." అన్నాడు ఆదిత్య.

కిటికీలో నుండి బయటకు చూసింది భ్రమరం. "నిజమే! కింద ఎవరో కారులో నుండి దిగుతున్నారు..." అంది.

"వాళ్లు లోపలకు రాకముందే, వస్తోంది నీ ప్రియురాలని ఎలా తెలిసింది?" అడిగాడు బ్రహ్మం.

"మాది జన్మ జన్మల బంధంలే! అమె నా దగ్గరలో ఉంటే ఒక విచిత్రమయిన పరిమళం నన్ను చుట్టుముడుతుంది..."

తేలిగ్గా తీసేసాడు బ్రహ్మం. "ప్రేమించుకున్నపుడు అన్నీ అలానే ఉంటాయి సార్! లోకమంతా అద్భుతంగా అనిపిస్తుంది. పెళ్లయ్యాకే ఏదన్నా అద్భుతం జరిగి ఎలాగయినా ఆ రొంపి నుండి బయటపడాలన్న భావం పెల్లుబుకుతుంది."

అతని మాట పూర్తికాక ముందే తలుపు తెరచుకుని ఇద్దరు అమ్మాయిలు లోపలకు వచ్చారు. వారిలో ఒకరు ఈషిక. మరొకరు ఎవరో ఆదిత్యకి తెలియదు.

లేచి నిలబడి, "రండి, రండి..." అన్నాడు ఆదిత్య. "మీ కోసం ఎప్పటి నుండో ఎదురు చూశాను. చాలా ఆలస్యంగా వచ్చారు..."

"అసలు నేను ఇక్కడకు వస్తానని ఎందుకనుకున్నారు?... నాకు ఆ కార్డులు ఎందుకు పంపారు?"

"ఆ మాత్రం ముందు చూపు లేకపోతే ఈ కంపెనీని మేము ఎలా నడుపుతామనుకున్నారు?" అన్నాడు ఆదిత్య.

"ఈమె నా స్నేహితురాలు. పేరు మృదుల." కుర్చీలో కూర్చుంటూ తన పక్కనున్న స్నేహితురాలిని పరిచయం చేసింది.

"గ్లాడ్ టు మీట్ యూ..." విష్ చేశాడు ఆదిత్య.

"మృదులకి మీ సహాయం కావాలి..."

"తప్పనిసరిగా! మేమున్నది అందుకేగా..."

ఈషిక మురారి ఫొటో తీసి ఇచ్చింది. "ఇతను మృదులని ప్రేమించేటట్లు చెయ్యాలి..."

"ముందు నాకు ఒక మాట చెప్పండి. మృదుల మురారిని ఇష్ట పడుతుందా?"



మృదుల కల్పించుకుంది. “ఇంత పెద్ద కంపెనీ నడుపుతున్నారు, మీకు ఆడవారి గురించి ఒక సింపుల్ విషయం ఇంకా తెలియదు ఆదిత్యా...”

ప్రశ్నార్ధకంగా చూశాడు ఆదిత్య. “మగవాళ్లు ఆడదాని అందం చూసి ఆకర్షణలో పడి ప్రేమించటం మొదలు పెడతారు. అదే ఆడవాళ్లు ప్రేమించిన తరువాత మగాడిలో అందం వెతుక్కుని ఆకర్షించబడతారు.”

నవ్వాడు ఆదిత్య. “అర్ధమయింది. ఇతని గురించి చెప్పండి...”

**ఇంకా ఉంది...**